సిద్దిపేట రిటర్నింగ్ అధికారి కార్యాలయం

నామినేషన్లకు వేళాయె..

నేటినుంచి శాసనసభ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ

- ఉదయం 11 నుంచి 3గంటల వరకు అవకాశం
- నామినేషన్లకు దాఖలుకు ఈనెల 10 చివరి రోజు
- సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్‌లో ఏర్పాట్లు
- రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో నామినేషన్ల స్వీకరణ
- సిద్దిపేట జిల్లాలో 9,37,585 మంది ఓటర్లు
- 1151 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

సిద్దిపేట, నవంబర్ 2(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు శుక్రవారం (నేటి) నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. ఇందుకోసం ఎన్నికల రిటర్నింగ్ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సిద్దిపేట జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రాల్లోని రిటర్నింగ్ అధికారుల కార్యాలయంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల్లోపు నామినేషన్లు స్వీకరిస్తారు. నామినేషన్లు దాఖలు చేయడానికి చివర గడువు నవంబర్ 10వ తేదీ. నామినేషన్ల స్క్రూటిని నవంబర్ 13, నామినేషన్ల ఉపసంహరణ నవంబర్ 15, నవంబర్ 30న పోలింగ్ జరుగుతుంది. డిసెంబర్ 3న ఎన్నికల ఫలితాలను ప్రకటిస్తారు.ఎన్నికల రిటర్నింగ్ అధికారుల సమక్షంలోనే నామినేషన్లు సమర్పించాల్సి ఉంటుంది. రిటర్నింగ్ అధికారి కార్యాలయాల వద్ద వంద మీటర్ దూరంలో బారికేడ్లను ఏర్పాటు చేశారు.ఆయా కేంద్రాల్లో సహాయక కేంద్రాలు సైతం ఏర్పాటు చేశారు. నామినేషన్ పత్రాల పూరింపులో ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేస్తారు.ఎన్నికల సజావుగా నిర్వహించేందుకు అధికారులు పక్కా ఏర్పాట్లు చేశారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు...

అన్ని పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీటి సౌకర్యాలు కల్పించడంతో పాటు దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ర్యాంప్‌లు ఏర్పాటు చేస్తున్నారు. శాసనసభ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కావడంతో జిల్లాలో రాజకీయం మరింత వేడెక్కనున్నది. ఆయా పార్టీల నాయకులు ప్రచారంలో మరింతగా దూకుడు పెంచనున్నారు. జిల్లాలో నాలుగు నియోజకవర్గాలతో పాటు జనగామ నియోజకవర్గంలోని గ్రామాలతో పాటు మానకొండూరు నియోజకవర్గంలోని బెజ్జంకి మండలంలో కొద్ది రోజులుగా బీఆర్ఎస్ అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. వారి ప్రచారానికి ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తున్నది.

సిద్దిపేట జిల్లాలో ఓటర్లు.. పోలింగ్ కేంద్రాల వివరాలు...

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	ఓటర్లు పురుషులు	మహిళలు	ఎన్నారైలు	ఇతరులు	మొత్తం ఓటర్లు
హుస్నాబాద్	304	1,18,584	1,20,999	09	04	2,39,596
సిద్దిపేట	273	1,14,059	1,16,764	05	69	2,30,892
దుబ్బాక	253	96,142	1,00,262	05	–	1,96,404
గజ్వేల్	321	1,34,317	1,36,369	02	07	2,70,693
మొత్తం	1151	4,63,102	4,74,394	21	80	9,37,585

సిద్దిపేట జిల్లాలోని ఆయా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు

రిటర్నింగ్ అధికారి	నియోజకవర్గం	ఫోన్ నెంబర్
గరిమా అగర్వాల్	దుబ్బాక	7093125333
రమేశ్‌బాబు	సిద్దిపేట	9849904287
బన్సీలాల్	గజ్వేల్	7331187576
బెన్ షాలోమ్	హుస్నాబాద్	7331187577

సిద్దిపేట జిల్లా (4స్థానాలు)

1. సిద్దిపేట
2. గజ్వేల్
3. దుబ్బాక
4. హుస్నాబాద్

నేటి నుంచి (3వ తేదీ) నామినేషన్ల స్వీకరణ

నామినేషన్ల దాఖలుకు చివరిరోజు	:	నవంబర్ –10
నామినేషన్ల స్క్రూటిని	:	నవంబర్ –13
నామినేషన్ల ఉపసంహరణకు	:	నవంబర్ –15
పోలింగ్ తేదీ	:	నవంబర్ –30
ఎన్నికల కౌంటింగ్ (ఫలితాలు)	:	డిసెంబర్ –03

సిద్దిపేట జిల్లాలోని ఆయా నియోజకవర్గాలలో వయస్సు వారిగా ఓటర్ల వివరాలు ఇలా...

నియోజకవర్గం	18–19	20–29	30–39	40–49	50–59	60–69	70–79	80–89	90–99	100–109	110–119	120ప్లస్	మొత్తం
హుస్నాబాద్	6667	46,984	65,716	46,094	34,195	23935	14,009	1682	306	04	0	04	2,39,596
సిద్దిపేట	5620	45,278	67096	47,128	32,247	20,239	10,884	2152	248	00	0	0	2,30,892
దుబ్బాక	5520	44,444	47,786	39,229	27,511	18,797	10,244	2438	388	47	0	0	1,96,404
గజ్వేల్	7768	58,234	78,404	49,910	36,500	23,688	13,157	2614	413	04	0	01	2,70,693
మొత్తం	25,575	1,94,940	2,59,002	1,82,361	1,30,453	86,659	48,294	8886	1355	55	0	05	9,37,585

సంగారెడ్డి జిల్లాలో.. ఐదు రిటర్నింగ్ ఆఫీసులు

సంగారెడ్డి జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం

- ఆన్‌లైన్‌లో నామినేషన్లకు అవకాశం
- నామినేషన్లు వేసేందుకు సిద్ధమవుతున్న పార్టీల అభ్యర్థులు
- సంగారెడ్డి, నారాయణఖేడ్, జహీరాబాద్‌లలో ఆర్డీవో కార్యాలయాల్లో నామినేషన్లు స్వీకరణ
- అందోలు, పటాన్‌చెరు తహసీల్ కార్యాలయాల్లో..

సంగారెడ్డి నవంబర్ 2(నమస్తే తెలంగాణ): సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన నామినేషన్ల పర్వం శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. సంగారెడ్డి జిల్లాలోని సంగారెడ్డి, నారాయణఖేడ్, పటాన్‌చెరు, అందోలు, జహీరాబాద్ నియోజకవర్గాల్లో ఎన్నికలకు సంబంధించి నామినేషన్లను శుక్రవారం నుంచి 10వ తేదీ వరకు స్వీకరించనున్నారు. వాటికి సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సంగారెడ్డి, నారాయణఖేడ్, జహీరాబాద్ నియోజకవర్గాల్లో ఆర్డీవో కార్యాలయాల్లో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు నామినేషన్లు స్వీకరిస్తారు. అందోలు, పటాన్‌చెరులో తహసీల్దార్ కార్యాలయాల్లో నామినేషన్ల స్వీకరించనున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్ నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాల్సిందిగా రిటర్నింగ్ అధికారులకు సూచించారు. నామినేషన్ల ఏర్పాట్లును సమీక్షించిన కలెక్టర్ శరత్ గురువారం రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నియమావళికి అనుగుణంగా నామినేషన్లు స్వీకరించాలని సూచించారు. నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా జిల్లా పోలీసు శాఖ బందోబస్తు ఏర్పాటు చేసింది. ఎస్పీ రూపేశ్ పోలీసు అధికారులతో మాట్లాడుతూ నామినేషన్ల సందర్భంగా ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన పోలీసు సిబ్బందికి సూచించారు.

జహీరాబాద్‌లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం

ఉదయం 11 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ

ఐదు నియోజకవర్గాల్లోని రిటర్నింగ్ అధికారులు ఎమ్మెల్యే అభ్యర్థుల నుంచి ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు తీసుకుంటారు. నామినేషన్ వేసే ఎమ్మెల్యే అభ్యర్థులు నియోజకవర్గంలో ఓటు హక్కు ఉండాలి. పక్క నియోజకవర్గంలో ఓటు హక్కు ఉంటే అందుకు సంబంధించిన పత్రాలను రిటర్నింగ్ అధికారికి దాఖలు చేయాల్సి ఉంటుంది. ఎమ్మెల్యే అభ్యర్థులు నాలుగు సెట్ల నామినేషన్లు వేయవచ్చు. జాతీయ, రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నుంచి నామినేషన్ వేసే అభ్యర్థులు అదే నియోజకవర్గానికి చెందిన ఒక ఓటరు ప్రపోజ్ చేయాల్సి ఉంటుంది. ఇండిపెండెంట్ అభ్యర్థులుకు అదే నియోజకవర్గానికి చెందిన పది మంది ఓటర్లు ప్రపోజ్ చేయాలి. ఎమ్మెల్యే నామినేషన్ వేసే అభ్యర్థులు వ్యక్తిగత వివరాలతో పాటు ఆస్తులు, కేసులకు సంబంధించిన వివరాలు తెలుపుతూ ఫామ్ 26తో పాటు అఫిడవిట్ దాఖలు చేయాల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు డిపాజిట్‌గా రూ.5వేలు, సాధారణ అభ్యర్థులు రూ.10వేలు చెల్లించాల్సి ఉంటుంది. నామినేషన్ వేసే ఎమ్మెల్యే అభ్యర్థులు తమ బ్యాంకు ఖాతా వివరాలను రిటర్నింగ్ అధికారికి అందజేయాలి. రిటర్నింగ్ అధికారికి ఇచ్చిన బ్యాంకు ఖాతా ద్వారానే ఎన్నికలకు సంబంధించి ఖర్చులు ఇతర లావాదేవీలు చేపట్టాల్సి ఉంటుంది. ఎమ్మెల్యే నామినేషన్ వేసే అభ్యర్థులు ర్యాలీ తీసుకునేందుకు పోలీసు శాఖ అనుమతిస్తుంది. అయితే ర్యాలీ రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయానికి వందమీటర్ల దూరంలోనే నిలిపివేయాలి. ఆ తర్వాత ఎమ్మెల్యే నామినేషన్ వేసే అభ్యర్థితోపాటు నలుగురిని మాత్రమే రిటర్నింగ్ ఆఫీసర్ వద్దకు అనుమతిస్తారు. ఇదిలా ఉంటే ఎన్నికల కమిషన్ ఆన్‌లైన్‌లో నామినేషన్ వేసేందుకు అనుమతి ఇస్తుంది. ఎమ్మెల్యే అభ్యర్థులు ఆన్‌లైన్‌లో నామినేషన్లు దాఖలు చేసిన పక్షంలో అందుకు సంబంధించిన పత్రాలను రిటర్నింగ్ అధికారికి ప్రత్యక్షంగా అందజేయాల్సి ఉంటుంది.

నామినేషన్ వేసేందుకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు

ఎమ్మెల్యేగా పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. బీఆర్ఎస్ జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు చింతా ప్రభాకర్(సంగారెడ్డి), మహిపాల్‌రెడ్డి(పటాన్‌చెరు), భూపాలరెడ్డి(నారాయణఖేడ్), చంటి క్రాంతికిరణ్(అందోలు), మాణిక్‌రావు (జహీరాబాద్) నామినేషన్లు వేసేందుకు సిద్ధం అవుతున్నారు. ఈ నెల 4 నుంచి 9వ తేదీలోగా నామినేషన్లు వేసేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు సన్నద్ధం అవుతున్నారు. టికెట్ దక్కిన అభ్యర్థులతో పాటు ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలనుకుంటున్న నాయకులు మంచిరోజులు చూసి నామినేషన్లు వేసేందుకు సిద్ధం అవుతున్నారు.

చేగుంటలో పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

బీజేపీ, కాంగ్రెస్ నేతలను కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి తన్నీరు హరీశ్‌రావు

అన్ని సర్వేలు బీఆర్ఎస్ వైపే..

- తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో కార్యకర్తలు పనిచేయాలి
- మూడోసారి కూడా ముఖ్యమంత్రి కేసీఆర్
- ప్రతి ఇంటి మీద గులాబీ జెండా ఎగరురాలి
- బీజేపీ డకౌట్.. కాంగ్రెస్ రన్ బౌట్
- కాంగ్రెస్ చెప్పే ఐదు గంటల కరెంట్‌తో ఎవుసం సాగుతుందా?
- దయాగుణం ఉన్న ప్రభాకరన్నకు అండగా ఉండాలి
- కేసీఆర్ రైతు బంధు ఇచ్చిన దేవుడు
- సిద్దిపేటతో పాటు దుబ్బాకకు అర్ధరాత్రి అయిన అండగా ఉంటా
- రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు

చేగుంట, నవంబర్ 2: తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో ఎన్నికల్లో కార్యకర్తలు పని చేసి దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డికి అండగా ఉండి, భారీ మెజార్టీతో గెలుపించుకోవాలని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. చేగుంట మండలంలోని వడియారం ఎస్ఎల్‌బీఎస్ గార్డెన్‌లో గురువారం దుబ్బాక నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలు, బూత్ కమిటీ అధ్యక్షులు, వందమంది ఓటర్ల ఇన్‌చార్జిలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. గత ఉప ఎన్నికల నుంచి నియోజకవర్గంలో కొంతమంది నాయకులు ఉద్ధృతకరమైన మాటలు మాట్లాడుతున్నారని, అలాంటి వారిపట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. వీమకు కూడా హాని చేయని ప్రభాకర్ రెడి కత్తి పోటుకు గురికావడం చాలా బాధాకరమన్నారు. ఈరోజు ఉదయం ప్రభాకర్‌రెడ్డి వద్దకు వెళ్లి, ఆయన ఆరోగ్య పరిస్థితి తెలుసుకునేందుకు వెళ్లగా, మాట్లాడడానికి కూడా రావడం లేదని, కన్నీటి ధారలు వస్తున్నాయన్నారు. ఆపదలో ఉన్న ప్రభాకర్‌రెడ్డికి అండగా ఉండి మీరే ప్రభాకర్‌రెడ్డిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ అమలుచేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, రైతు బంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, ఆసరా పింఛన్లు, ఇంటింటికీ మిషన్ భగీరథ తాగునీరు, ప్రాజెక్టులతో వచ్చే సాగు నీటితోపాటు బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఉన్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో దుబ్బాకలో గులాబీ జెండా ఎగురవేయాలన్నారు. పార్టీలో ఉండి పార్టీకి మోసం చేస్తే కన్న తల్లిని మోసం చేసినట్లేనన్నారు. తెలంగాణ రాకపోతే కాళేశ్వరం వచ్చేది కాదని, రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఉండేది కాదన్నారు. రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు కూడ రాకపోతుండే అన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిపోయినట్లేనని, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి శివకుమార్ వికారాబాద్ సభలో 5 గంటల కరెంట్ ఇస్తున్నామని, బహిరంగంగా చెప్పుకోవడం, రేవంత్‌రెడ్డి మూడు గంటల విద్యుత్ సరిపోతుందని చెప్పడం, చూస్తుంటే తెలంగాణలో ఎవరూ కాంగ్రెస్‌కు ఓటేయరన్నారు.

ఒక్క హామీని నెరవేర్చని బీజేపీ ఎమ్మెల్యే

దుబ్బాక ఉప ఎన్నికల్లో రఘునందన్‌రావు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదని, డిగ్రీ కళాశాల, నూతన పరిశ్రమలు, బొటల్ రింగ్‌రోడ్డు, ఉచిత కార్పొరేట్ దవాఖాన, ప్రతి నిరుద్యోగికి నిరుద్యోగ భృతి, రైతులకు రెండు ఎడ్ల బండి, పసే మట్టలు, స్కిల్ డెవలప్‌మెంట్ హామీలు ఇచ్చి, గెలిచిన రఘునందన్‌రావు ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. దీంతో దుబ్బాక పూర్తిగా అభివృద్ధిలో వెనుకబడి పోయిందన్నారు. అలాంటి దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధి కేవలం కొత్త ప్రభాకర్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటేసి కొత్త ప్రభాకర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు సోలిపేట సతీశ్‌రెడ్డి, మనోహర్‌రావు, మామిడి మోహన్ రెడ్డి, వెంకట సర్పంహారెడ్డి, చిందం రాజ్‌కుమార్, చేగుంట ఎంపీపీ మాసుల శ్రీనివాస్, జడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు రంగయ్యగారి రాజిరెడ్డి, నార్సింగి ఎంపీపీ చిందం సబిత, జడ్పీటీసీ బాణాపురం కృష్ణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మైలరాం బాబు, దుబ్బాక నియోజక వర్గ బీఆర్ఎస్ నాయకులు భాస్కరాచారి, గజ్జల సాయిలు, లక్ష్మీలింగం, అంజిరెడ్డి, బి.శ్రీకాంత్‌రెడ్డి, రొట్టే రాజమౌళి పంతులు, తిమ్మాపూర్ మాధవి, జడిపల్లి రాంరెడ్డి, హరికృష్ణారెడ్డి, వెంకటేశ్వరశర్మ, యాదగిరి, ఇప్ప దయాకర్, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, బోనాల శ్రీనివాస్, కొత్త పుష్పలత కిషన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, గన్ను వనితాభూంరెడ్డి, రణం జ్యోతి శ్రీనివాస్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, నారాయణరెడ్డి, తాసీమ్, కొండల్‌రెడ్డి, రాజిరెడ్డి, వేణుగోపాల్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సమక్షంలో వెయ్యిమంది బీఆర్ఎస్‌లో చేరిక

వడియారం ఎస్ఎల్‌బీఎస్ గార్డెన్‌లో దుబ్బాక నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమక్షంలో దుబ్బాక నియోజకవర్గం నుంచి వివిధ మండలాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు వెయ్యిమంది మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మంత్రి హరీశ్‌రావు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు.

నేటినుంచే నామినేషన్ల స్వీకరణ

- అభ్యర్థుల ఆస్తులు, నేర చరిత్ర చెప్పాల్సిందే..
- నామినేషన్లను ఆన్‌లైన్‌లోనూ వేసుకోవచ్చు
- మధ్యాహ్నం 3 తర్వాత నామినేషన్ల స్వీకరణ నిలిపివేత
- అభ్యర్థితో పాటు నలుగురికే అనుమతి

మెదక్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల్లో తొలి అంకం నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ. రేపటి (శుక్రవారం) నుంచి ప్రారంభం కానున్నది. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగనున్నది. రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. నామినేషన్ పత్రాన్ని సరిగా పూర్తి చేసి ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ)కి అప్పగించడం, వివిధదానాలను అనుసరించి వ్యవహరించడం, పలు అంశాలను తూ.చా తప్పకుండా పాటించాల్సిన అవసరం ఉంటుంది. ముఖ్యంగా ఎన్నికల అఫిడవిట్‌లో తమ ఆస్తులు, నేర చరిత్ర, కులం వంటి వివరాలను పక్కాగా నమోదు చేయాలి. ఇందులో ఏమాత్రం పొరపాటు జరిగినా వారి నామినేషన్ తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉంటుంది. అఫిడవిట్‌లో వివరాలు తప్పుగా నమోదు చేసి ఎన్నికల్లో విజయం సాధించినా ప్రత్యర్థులు కోర్టును ఆశ్రయిస్తే పదవిని కోల్పోయే ప్రమాదం ఉంది. నామినేషన్ పత్రాల్లో సరైన వివరాలు జాగ్రత్తగా నమోదు చేయాలి. నామినేషన్ వేసే సమయంలో అభ్యర్థులు ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు.

మెదక్‌లో అధికారులతో మాట్లాడుతున్న మెదక్ ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా

ఆస్తుల వివరాలు అందించాల్సిందే..

ఎన్నికల్లో పోటీ చేసే ఎమ్మెల్యే అభ్యర్థులు నామినేషన్ పత్రాల్లో తమకున్న ఆస్తుల వివరాలను విధిగా నమోదు చేయాలి. స్థిర, చర ఆస్తులు, ఆభరణాలు, వాహనాల వివరాలు నిర్దిష్ట ప్రొఫార్మాలో నమోదు చేయాల్సి ఉంటుంది. వారికున్న రుణాలు, అప్పులు, ఐదేళ్లలో జరిగిన ఆర్థిక లావాదేవీల వివరాలు సైతం అందించాలి.

అభ్యర్థులు నామినేషన్లను ఆన్‌లైన్‌లో కూడా వేసుకోవచ్చు

తెలంగాణ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కమిషన్ కీలక నిర్ణయం తీసుకున్నది. అభ్యర్థులు తమ నామినేషన్లను ఆన్‌లైన్‌లో కూడా దాఖలు చేసే సౌకర్యాన్ని కల్పిస్తున్నది. ఆన్‌లైన్‌లో దాఖలు చేసిన పత్రాలను తిరిగి ప్రత్యక్షంగా రిటర్నింగ్ అధికారికి అందించాల్సి ఉంటుంది.

మధ్యాహ్నం 3 తర్వాత నామినేషన్ల స్వీకరణ నిలిపివేత

శుక్రవారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్నది. అన్ని నియోజకవర్గాలకు సంబంధించిన రిటర్నింగ్ అధికారుల గదిలో ఉండే గోడ గడియారమే ప్రామాణికంగా తీసుకోనున్నారు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత నామినేషన్ల స్వీకరణ నిలిపివేస్తారు. ఒక్కో అభ్యర్థి నాలుగు నామినేషన్లు దాఖలు చేయవచ్చని, అఫిడవిట్ విషయంలో అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అభ్యర్థులు సమర్పించే నామినేషన్లలోని అఫిడవిట్లను అదే రోజు కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాల వెబ్ సైట్లలో అప్‌లోడ్ చేయనున్నారు.

అభ్యర్థితో పాటు నలుగురికే అనుమతి..

నామినేషన్ వేయడానికి వెళ్లే అభ్యర్థి వెంట నలుగురికి మాత్రమే అవకాశం ఉంది. నామినేషన్‌తోపాటు అభ్యర్థికి సంబంధించిన బ్యాంకు ఖాతా వివరాలను ఆర్‌వోకు అందజేయాల్సి ఉంటుంది. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యేంత వరకు ఆ ఖాతాను కొనసాగించాలి. అభ్యర్థి నామినేషన్ అఫిడవిట్‌లో ఫామ్ 26, ఫామ్ ఏబీ నింపాలి. ఒక అభ్యర్థి 4 సెట్ల నామినేషన్లు చేయవచ్చు. అభ్యర్థి డిపాజిట్ ఫీజు జనరల్ అభ్యర్థికి రూ.10,000, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థికి రూ.5000లు చెల్లించాల్సి ఉంటుంది. నామినేషన్ వేసే అభ్యర్థి సర్టిఫికేట్ పత్రాలు సమర్పించాలి. నామినేషన్‌కి వచ్చే వాహనాలు ఆర్‌వో కార్యాలయానికి 100 మీటర్ల దూరంలో నిలపాలి. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి వివరాలు కేవైసీ ద్వారా తెలుసుకోవచ్చు. గూగుల్ ప్లే స్టోర్ లేదా యాపిల్ యాప్ స్టోర్ నుంచి కేవైసీ డౌన్ లోడ్ చేసుకోవాలి.